teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 02 | సంచిక : 420 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | సోమవారం | 1 జులై 2024 | పేజీలు : 08 | వెల ‘5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## మన్ కీ బాత్‌ని పునః ప్రారంభించిన మోదీ

**మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇదే మొదటిది**



న్యూ ఢిల్లీ, జూన్ 30 (తీన్మార్ న్యూస్): మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మోడీ ఆదివారం తన నెలవారీ రేడియో కార్యక్రమం మన్ కీ బాత్ ని పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, 2024 సార్వత్రిక ఎన్నికలు ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికలని అన్నారు. ప్రపంచంలో ఏ దేశంలో కూడా ఇంత పెద్ద ఎన్నికలు జరగలేదు, దాదాపు 65 కోట్ల మందికి పైగా ప్రజలు ఈ ఎన్నికల్లో ఓటు వేశారని తెలిపారు. దీని కోసం తీవ్రంగా కృషి చేసిన ఎన్నికల సంఘాన్ని మోడీ అభినందించారు. ఈ కార్యక్రమంలో మోడీ మాట్లాడుతూ, ఆయన తన తల్లిని

మిగతా 2 లో



## ధర్మపురి శ్రీనివాస్ భౌతికకాయానికి సీఎం రేవంత్ రెడ్డి నివాళ్లు

నిజామాబాద్, జూన్ 30 (తీన్మార్ న్యూస్): మాజీ మంత్రి, మాజీ పీసీసీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ భౌతికకాయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. ఆదివారం ఉదయం నిజామాబాద్ లోని డీఎస్ నివాసానికి వెళ్లి ఆయన పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎంపీ ధర్మపురి అరవింద్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సీఎం రేవంత్ తోపాటు పలువురు మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డీఎస్ కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన

మిగతా 2 లో




# ఉపాధ్యాయుల బదిలీలు

- 40 మంది ఉంటే ఇద్దరు.. 60 మందికి ముగ్గురు
- బదిలీల్లో ఉపాధ్యాయుల కేటాయింపు విధానమిదే
- విద్యార్థులు, టీచర్ల నిష్పత్తి హేతుబద్ధీకరణ
- విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాల కోసమే..
- ప్రవేశాల్లేని బడులకు ఉపాధ్యాయులను ఇవ్వరు

**10 మంది పిల్లలున్న పాఠశాలకు ఒక టీచర్**

**రాష్ట్రంలోని పాఠశాలల్లో ఇకపై విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగానే ఉపాధ్యాయులను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందుతుందని భావిస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీల్లో ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులను కూడా ఈ మేరకే చూపిస్తున్నారు.**

తెలంగాణ బ్యూరో, జూన్ 30 (తీన్మార్ న్యూస్): బదిలీల్లో భాగంగా ప్రస్తుతం.. ఉపాధ్యాయులు తాము కోరుకునే స్థానాలకు సంబంధించి వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకునే ప్రక్రియ కొనసాగుతోంది. అయితే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా.. కొన్ని పాఠశాలల్లో ఉన్న పోస్టుల కంటే తక్కువ పోస్టులను చూపిస్తున్నారని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కానీ, ఆ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా టీచర్ పోస్టులు కేటాయించే క్రమంలో

మిగతా 2 లో



## జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ బోర్డు విలీనం

- విలీనాన్ని ఆమోదిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు
- ఫలించిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ

హైదరాబాద్, జూన్ 30 (తీన్మార్ న్యూస్): సికింద్రాబాద్ కంటోన్మెంట్ వాసుల చిరకాల కోరిక నెరవేరింది. కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని సివిల్ ఏరియాలను జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అందుకు

మిగతా 2 లో



## భద్రాద్రి థర్మల్ కేంద్రంలో పిడుగుపడింది వాస్తవమే

**హైదరాబాద్ జెన్కో థర్మల్ డైరెక్టర్ లక్ష్మయ్య**

భద్రాద్రి, జూన్ 30 (తీన్మార్ న్యూస్): శనివారం రాత్రి భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని స్విచ్ యార్డ్ ప్రాంతంలో పిడుగుపడింది వాస్తవమేనని హైదరాబాద్ జెన్కో థర్మల్ డైరెక్టర్ లక్ష్మయ్య తెలిపారు. విద్యుత్ కేంద్రంలో అమర్చిన

మిగతా 2 లో

## ప్రభుత్వ పాఠశాలలను చిన్నాభిన్నం చేసిన కార్పొరేట్ విద్యాసంస్థలు

**కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్**



సిద్దిపేట, జూన్ 30 (తీన్మార్ న్యూస్): కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ పాఠశాలలు, శిశు మందిరాలను ఛిన్నాభిన్నం చేశాయని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సంస్కృతీ, సంప్రదాయాలకు శిశుమందిర్ పాఠశాలలు నిలయాలని కేంద్ర మంత్రి కొనియాడారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల నూతన

మిగతా 2 లో

## కొత్త క్రిమినల్ చట్టాల వల్ల బాధితులకే ఎక్కువగా నష్టం

- వీటిపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం
- బీఆర్ఎస్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ సంచలన ఆరోపణలు



తెలంగాణ బ్యూరో, జూన్ 30 (తీన్మార్ న్యూస్): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలపై బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. జులై 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త చట్టాల వల్ల బాధితులే ఎక్కువగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వీటిపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ప్రకటించారు వినోద్. ఇదే అంశంపై ఆదివారం నాడు మీడియాతో మాట్లాడిన వినోద్ కుమార్.. క్రిమినల్ లా కు సంబంధించిన మూడు

మిగతా 2 లో

## 80 శాతం ఆస్పత్రుల్లో కనీస సౌలతులు లేవు

- దేశవ్యాప్తంగా 20 శాతం ఆస్పత్రుల్లోనే కనీస ప్రమాణాలు
- ఎన్ హెచ్ఎం ఆధ్వర్యంలోని ఆస్పత్రుల్లో అరకొర ఫెసిలిటీలు
- కేంద్ర ఆరోగ్య శాఖ సర్వేలో వెల్లడి



న్యూ ఢిల్లీ, జూన్ 30 (తీన్మార్ న్యూస్): దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, యూటీల్లోని సర్కార్ దవాఖాన్లలో దాదాపు 80 శాతం ఆస్పత్రుల్లో కనీస సౌలతులు, సిబ్బంది, ఎక్విప్ మెంట్, ప్రమాణాలు కూడా లేవని కేంద్ర ఆరోగ్య శాఖ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. కేవలం 20 శాతం సర్కార్ దవాఖాన్లలోనే ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ (ఐపీహెచ్ఎస్)కు అనుగుణంగా కనీస ప్రమాణాలు ఉన్నట్టు తేలింది. దేశవ్యాప్తంగా నేషనల్ హెల్త్ మిషన్


మిగతా 2 లో




## ఆరు గ్యారెంటీల అమలుపై బీఆర్ఎస్ తీవ్ర విమర్శలు

తెలంగాణ బ్యూరో, జూన్ 30 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్పార్టీ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తోంది. ఎన్నికల సమయంలోనే కాంగ్రెస్ నాయకులంతా మేము అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే మేము ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పుకుంటూ వచ్చారు. వంద రోజులు కాదు కదా 200రోజులు కూడా గడిచిపోయాయి. అయినా కాంగ్రెస్పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు

మిగతా 2 లో



## ప్రఖ్యాత పుణ్యక్షేత్రం తిరుమలలో భక్తుల తాకిడి

**ఒక్క రోజే హుండీ ద్వారా 3.83 కోట్ల రూపాయల ఆదాయం**


తిరుపతి, జూన్ 30 (తీన్మార్ న్యూస్): ప్రఖ్యాత పుణ్యక్షేత్రం తిరుమలలో భక్తుల తాకిడి నెలకొంది. శనివారం 80,404 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వారిలో 35,825 మంది తలనీలాలు సమర్పించారు. తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆ ఒక్క రోజే

మిగతా 2 లో

## ఖమ్మం నగరానికి రింగ్ రోడ్డు ఏర్పాటు

- ఇప్పటికే మూడు కొత్త జాతీయ రహదారుల నిర్మాణం
- మూడు రోడ్లను కలిపేందుకు తాజాగా లింక్ రోడ్డు
- రూ.125 కోట్లతో 6.5 కిలోమీటర్ల రహదారికి ఎన్‌హెచ్ అప్రూవల్

ఖమ్మం, జూన్ 30 (తీన్మార్ న్యూస్): ఖమ్మం నగరానికి రింగ్ రోడ్డు ఏర్పాటు కాబోతున్నది. ఇప్పటికే నగరం చుట్టూ కొత్తగా మూడు జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతోంది. వీటి కారణంగా నగరానికి మూడు వైపులా రింగ్ రోడ్డు రూపంలో ఫార్మేషన్ జరుగుతోంది. ఈ మూడు రోడ్లను




మిగతా 2 లో



## ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాల గడువు తేదీ పొడిగింపు

**అడ్మిషన్లు పొందేందుకు అనుమతి ఇచ్చినట్లు ఓ ప్రకటనలో వెల్లడి**

హైదరాబాద్, జూన్ 30 (తీన్మార్ న్యూస్): ఇంటర్ ఫస్టియర్ లో ప్రవేశాలకోసం గడువు తేదీని పొడిగించింది తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు. జూలై 31 వరకు ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు పొందేందుకు అనుమతి ఇచ్చినట్లు ఓ ప్రకటనలో తెలిపింది. జూన్ 28న పదో తరగతి

మిగతా 2 లో



## కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శలు

**కిషన్ రెడ్డి అబద్ధాలు చెప్పడంలో మోడీని మించిపోయారని ఎద్దేవా**

.. వివరాలు 2లో

# జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ బోర్డు విలీనం

మొదటి పేజీ తరువాయి

సంబంధించిన మార్గదర్శకాలపై స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. కంటోన్మెంట్ బోర్డును జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఢిల్లీకి వెళ్లినప్పుడల్లా రక్షణ శాఖ మంత్రి దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లారు. మార్చి 5వ తేదీన రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో బ్రిటీష్ కాలం నుంచి ఇప్పటివరకు కొనసాగుతున్న కంటోన్మెంట్ బోర్డులన్నింటిని రద్దు చేసి మున్సిపాలిటీల్లో విలీనం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఇటీవలే కేంద్ర రక్షణ శాఖకు లేఖ రాశారు. ఈ నెల 25న కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లోనూ విలీన ప్రక్రియను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కేంద్రం ఆమోదంతో కంటోన్మెంట్ లోని సివిల్ ఏరియాలను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తారు. అక్కడి ప్రజలకు నిర్దేశించిన సౌకర్యాలు, మౌలిక వసతులన్నీ ఉచితంగా జీహెచ్ఎంసీకి బదిలీ చేస్తారు. కంటోన్మెంట్ బోర్డుల ఆస్తులు, అప్పులన్నీ మున్సిపాలిటీకి బదిలీ అవుతాయి. అక్కడ ఇప్పటికే లీజులు ఇచ్చినవి కూడా మున్సిపాలిటీకి బదిలీ అవుతాయి. మిలిటరీ స్టేషన్ మినహా కంటోన్మెంట్ లోని నివాస ప్రాంతాలకు జీహెచ్ఎంసీ పరిధి విస్తరిస్తుంది. తన పరిధిలో ఉన్న వాటిపై పన్నులను విధిస్తుంది. కేంద్ర ప్రభుత్వం పేరిట హక్కుగా ఉన్న భూములు, ఆస్తులు కేంద్రానికే దక్కుతాయి. ఈ ప్రాంతాలను విభజించేటప్పుడు, సాయుధ దళాల భద్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని కేంద్రం స్పష్టం చేసింది. తాము నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, కంటోన్మెంట్ బోర్డు బాధ్యులకు ఉన్న సందేహాలను నివృత్తి చేసి, తదుపరి కార్యాచరణ చేపట్టాలని సూచించింది. తెలంగాణతో పాటు మరో ఎనిమిది రాష్ట్రాల కంటోన్మెంట్లు కూడా స్థానిక సంస్థలలో విలీనం కానున్నందున ఆయా కంటోన్మెంట్ ల పరిధిలోని భూములను ఆ రాష్ట్రాల స్థానిక సంస్థలకు కేంద్రం అప్పగించనుంది.

# భద్రాద్రి థర్మల్ కేంద్రంలో పిడుగుపడింది వాస్తవమే

మొదటి పేజీ తరువాయి

సీసీ ఫుటేజ్ ద్వారా పిడుగు పడటాన్ని గమనించామని ఆయన మీడియా ద్వారా తెలియజేశారు. శనివారం భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో పిడుగు పడిందని సమాచారం తెలుసుకొని హైదరాబాద్ జెన్కో థర్మల్ అధికారులు ఆదివారం భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం స్విచ్ యార్డ్ ప్రాంతంలో దగ్ధమైన విద్యుత్ అవుట్ ఫుట్ ట్రాన్స్ఫార్మర్లు క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో విద్యుత్ అవుట్ ఫుట్ ఇచ్చే ట్రాన్స్ఫార్మర్లపై పిడుగు పడిందని తెలిపారు. దీంతోనే విద్యుత్ కేంద్రంలో భారీగా మంటలు ఎగిసిపడ్డాయన్నారు. ట్రాన్స్ఫార్మర్ల లో ఉండే కరెంట్ ఆయిల్ కారణంగా మంటలు ఉధృతమైనట్టుగా గుర్తించామన్నారు. ఈ పిడుగుపాటుతో పవర్ కేంద్రానికి సుమారు 25కోట్ల ఆస్తినష్టం జరిగిందన్నారు. ఈప్రమాదంలో ఆస్తినష్టం తప్ప ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదన్నారు. ఈ ప్రమాదం వల్ల మొదటి యూనిట్లో 270 మెగావాట్ల ఉత్పత్తికి అంతరాయం ఏర్పడిందని, త్వరలో మొదటి యూనిట్ ఉత్పత్తి పునరుద్ధరణకు పూర్తి చర్యలు చేపడతామని ఆయన వెల్లడించారు. జెన్కో థర్మల్ డైరెక్టర్ లక్ష్మయ్యతో పాటు సీఈ బిచ్చన్న తదితర విద్యుత్ అధికారులు పాల్గొన్నారు

# ధర్మపురి శ్రీనివాస్ భౌతికకాయానికి సీఎం రేవంత్ రెడ్డి నివాళ్లు

మొదటి పేజీ తరువాయి

సీఎం రేవంత్ డీఎస్ క్రమశిక్షణ కలిగిన నాయకుడన్నారు. కాంగ్రెస్ కు ఆయన చేసిన సేవలు మరవలేరన్నారు. కార్యకర్త స్థాయి నుంచి పీసీసీ చీఫ్ వరకు ఎదిగారని తెలంగాణ ఏర్పాటుకు ఆయన ఎంతో కృషి చేశారు. డీఎస్ కుటుంబానికి కాంగ్రెస్ అండగా ఉంటుందని చెప్పారు. కాగా, నిజామాబాద్ లోని వ్యవసాయ క్షేత్రంలో అధికార లాంఛనాలతో డీఎస్ అంత్యక్రియలు మరికాసేపట్లో నిర్వహించనున్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న డీ శ్రీనివాస్ శనివారం తెల్లవారుజామున హైదరాబాద్ లోని నివాసంలో గుండెపోటుతో కన్నుమూశారు.

# ప్రభుత్వ పాఠశాలలను చిన్నాభిన్నం చేసిన కార్పొరేట్ విద్యాసంస్థలు

మొదటి పేజీ తరువాయి

భవనాన్ని ఆయన ప్రారంభించారు. భవిష్యత్ తరాలకు మంచి మార్గంలో బోధన అందించేందుకు ఈ పాఠశాలలు ఎంతో దోహదపడతాయని సంజయ్ చెప్పారు. శిశుమందిర్ విద్యార్థిగా క్రమశిక్షణతో న్యాయం, ధర్మం కోసం పోరాడితే గత ప్రభుత్వాలు తనపై 109కేసులు పెట్టాయని కేంద్ర మంత్రి ఆరోపించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ ఈ భూమి బిడ్డలం హిందూవులం అందరం బ్రతుకు బంగారు లోకం అనే పాట పాడి విద్యార్థులను అలరించారు.

# కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శలు

తెలంగాణ బ్యూరో, జూన్ 30 (తీన్మార్ న్యూస్): కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డిపై ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శలు చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కిషన్ రెడ్డి అబద్ధాలు చెప్పడంలో ప్రధాని మోడీని మించిపోయారని ఎద్దేవా చేశారు. తెలంగాణకు తలమానికమైన సింగరేణి బొగ్గు గనులను ప్రైవేట్ సంస్థలకు విక్రయించడం సరికాదని అన్నారు. తెలంగాణకు చెందిన కిషన్ రెడ్డి నేతృత్వంలోనే సింగరేణి బొగ్గు గనులు వేలం జరగడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి విషయంలో బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని.. ఆ రెండు పార్టీలు సింగరేణిని ప్రైవేట్‌పరం చేసేందుకు కుట్ర చేశారని ఫైర్ అయ్యారు. సింగరేణిపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. సింగరేణి బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో జూలై 5న కలెక్టరేట్ల ముట్టడిస్తామని స్పష్టం చేశారు.

# ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాల గడువు తేదీ పొడిగింపు

మొదటి పేజీ తరువాయి

అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల కావడంతో పాస్ అయిన విద్యార్థులకు ఛాన్స్ ఇచ్చేందుకు ఈ గడువు తేదీని పొడిగించినట్లు బోర్డు తెలిపింది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రవేటు, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ఫస్టియర్ జనరల్, ఒకేషనల్ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రక్రియ కొనసాగుతుంది. పదో తరగతి గ్రేడ్, రిజర్వేషన్ల ఆధారంగా సీట్ల కేటాయింపు చేస్తారు. ఇంటర్ అడ్మిషన్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థులకు సూచించింది. బోర్డు గుర్తింపు ఉన్న కాలేజీల్లో మాత్రమే చేరాలని స్పష్టం చేసింది. గుర్తింపు పొందిన కాలేజీల వివరాలను ఇంటర్ బోర్డు వెబ్ సైట్ లో ఉంచింది. వివరాలను చెక్ చేసుకుని అడ్మిషన్లు పొందాలని సూచించింది.

# లా ఆఫీసర్ పోస్టుకు అప్లికేషన్ గడువు పొడిగింపు

## టీజీపీఎస్సీ మరో ఆరు రోజులు పొడిగిస్తూ నిర్ణయం

తెలంగాణ బ్యూరో, జూన్ 30 (తీన్మార్ న్యూస్): లా ఆఫీసర్ పోస్టుకు అప్లికేషన్ గడువును టీజీపీఎస్సీ మరో ఆరు రోజులు పొడిగించింది. నియామకాల విషయంలో ఎదుర్కొంటున్న లీగల్ కేసులను స్టడీ చేసి వాదించేందుకు లీగల్ సెల్‌ను ఏర్పాటు చేసిన కమిషన్. ప్రభుత్వ ఆదేశాల మేరకు లా ఆఫీసర్ పోస్టును క్రియేట్ చేసింది. ఆ పోస్టుకు ఈ నెల 12న టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వంలో ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసి ఐదేండ్లు అనుభవం ఉన్న ఎల్ఎల్ఎం/ఎల్ఎల్బీ అభ్యర్థులు అర్హులని పేర్కొంటూ జూన్ 30 వరకు గడువు విధించింది. తాజాగా ఆ గడువును జులై 6 సాయంత్రం 5 గంటల వరకు పొడిగించింది.

# విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు

మొదటి పేజీ తరువాయి

కొన్ని పాఠశాలలకు ఉన్న పోస్టుల కంటే తక్కువ మంది ఉపాధ్యాయులను ఇవ్వనున్నారు.

మరికొన్ని పాఠశాలల్లో పోస్టుల కంటే ఎక్కువ మంది టీచర్లను కేటాయించే అవకాశం కూడా ఉంది. పాఠశాల విద్యా బోధనలో నాణ్యతా ప్రమాణాలు పెంచేందుకు, ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్యా బోధనను అందించేందుకే ఈ విధంగా ఉపాధ్యాయ బదిలీలు చేపడుతున్నట్లు ప్రభుత్వం పేర్కొంటోంది. ప్రస్తుతం ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న చోట తక్కువ మంది ఉపాధ్యాయులు, తక్కువ మంది విద్యార్థులు ఉన్న చోట ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉండడంతో విద్యా ప్రమాణాలు నానాటికీ పడిపోతున్నాయి. కొన్ని చోట్ల అసలు విద్యార్థులే లేని పాఠశాలల్లోనూ ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ నేపథ్యంలో.. విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిలో హేతుబద్ధతకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు గతంలో ఉన్న మార్గదర్శకాలను కొంత సవరించింది.

**మెరుగైన విద్యా బోధన కోసమే..**

ఇప్పటివరకు ఉన్న విధానం ప్రకారం.. 0–19 మంది వరకు విద్యార్థులు ఉన్న పాఠశాలకు ఒక టీచర్, 20 నుంచి 60 మంది విద్యార్థులున్న పాఠశాలకైతే ఇద్దరు, 61 నుంచి 90 మంది వరకు విద్యార్థులున్న పాఠశాలకు ముగ్గురు టీచర్లు ఉండేలా గత ప్రభుత్వం 2015 జూన్ 27న జీవో నెంబరు 17, తర్వాత 2021 ఆగస్టు 21న జీవో నెంబరు 25ను జారీ చేసింది. కానీ, ప్రస్తుత ప్రభుత్వం ఈ విధానంలో కొన్ని మార్పులు చేసింది. విద్యార్థుల సంఖ్య, వారికి మెరుగైన విద్యా బోధన అందించే విషయాలను దృష్టిలో పెట్టుకొని ఆయా పాఠశాలలకు టీచర్ పోస్టులను కేటాయించాలని సర్కారు నిర్ణయించింది. దీని ప్రకారం.. 1 నుంచి 10 మంది విద్యార్థులున్న పాఠశాలకు ఒక టీచర్‌ను, 11 నుంచి 40 మంది వరకు విద్యార్థులున్న పాఠశాలకైతే ఇద్దరు టీచర్లను కేటాయించాలని నిర్ణయించారు. ఇక 41 నుంచి 60 మంది విద్యార్థులున్న పాఠశాలకు ముగ్గురు టీచర్లను కేటాయించాలని, 61కిపైన విద్యార్థులున్న పాఠశాలకైతే.. ఆ స్కూల్‌కు మంజూరైన అన్ని పోస్టులనూ భర్తీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకే వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. ఒక్క విద్యార్థి కూడా లేని (జీరో అడ్మిషన్ల) పాఠశాలలకు ఉపాధ్యాయులను కూడా కేటాయించడం లేదు. ఈ మేరకు బదిలీ ఆప్షన్ కూడా ఇవ్వకూడదని నిర్ణయించారు. రాష్ట్రంలో ఈ ఏడాది జీరో అడ్మిషన్ల స్కూళ్ల సంఖ్య 1,739గా గుర్తించారు. వీటిలో ఇప్పటికీ 1,609 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఇందులో ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్నవారు తప్పనిసరిగా బదిలీ అవుతారు. ఎనిమిదేళ్లు పూర్తికాని వారు మాత్రం ఆ పాఠశాలల్లోనే ఉంటారు. బదిలీల ప్రక్రియ పూర్తయి సోమవారం ఉదయం పోస్టుల కేటాయింపు తర్వాత విద్యార్థులు లేని పాఠశాల్లలో ఎంతమంది ఉపాధ్యాయులు ఉన్నారనేది స్పష్టత రానుంది.

**పాఠశాలలో ఒకరిద్దరు విద్యార్థులు చేరినా ఓకే..**

విద్యార్థులు లేని పాఠశాలల్లో ఒకరిద్దరు విద్యార్థులు చేరినా ఉపాధ్యాయులను కేటాయిస్తారు. ఒక్క విద్యార్థి కూడా లేని పాఠశాలల్లోని ఉపాధ్యాయులు విద్యార్థులు ఉన్న ఇతర పాఠశాలకు బదిలీ కావాలని కోరుకుంటే ప్రభుత్వం వెంటనే ట్రాన్స్‌ఫర్ చేస్తుంది.

అంతేకాకుండా.. పాఠశాలలో ప్రస్తుతం ఉన్న విద్యార్థుల కన్నా రాబోయే రోజుల్లో ఎక్కువ మంది చేరితే ..పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కొత్తగా ఉపాధ్యాయులను కేటాయించనున్నారు. ఈ విధానం ద్వారా ఉపాధ్యాయుల కొరత సమస్య కూడా తలెత్తదని, ఎక్కువ మంది విద్యార్థులున్న స్కూళ్లకు ఆ మేరకు టీచర్లను కేటాయించే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. శిక్షణ పొంది, నైపుణ్యం, అపార అనుభవం ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయుల బోధన విద్యార్థులకు అందేలా చూడాలన్నదే ప్రభుత్వం లక్ష్యంగా ఉంది.

ఈ మేరకే విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని హేతుబద్ధీకరించాలని నిర్ణయించింది. విద్యార్థులు లేనిచోట ఉపాధ్యాయుల సామర్థ్యం వృథా కావద్దనే ఉద్దేశంతోనే బదిలీల్లో విద్యార్థులు లేని పాఠశాలలను వెబ్ ఆప్షన్‌లో బ్లాక్ చేసినట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. మిగిలిన పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఖాళీలను ఆన్‌లైన్‌లో చూపారు. ఇప్పటికే ఉపాధ్యాయులు (రంగారెడ్డి జిల్లా మినహా) వెబ్ ఆప్షన్లు ఇవ్వడం దాదాపు పూర్తయింది. ఆదివారం రాత్రి వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ముగుస్తుంది. వాటిని పరిశీలించిన తర్వాత సోమవారం ఉదయం ఉపాధ్యాయులు పెట్టుకున్న దరఖాస్తుల ఆధారంగా ఆయా పాఠశాలలకు వారిని బదిలీ చేసి ఆ వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచుతారు. సోమవారం ఉదయం నుంచి రంగారెడ్డి జిల్లాలోని పాఠశాలల్లో ఖాళీలకు అనుగుణంగా బదిలీల ప్రక్రియను ప్రారంభించి మూడు రోజుల్లో దానిని పూర్తి చేస్తారు.

**ఉపాధ్యాయ సంఘాల అభ్యంతరాలు..**

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పలు ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ నిర్ణయం కారణంగా.. ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను వెబ్ ఆప్షన్లలో చూపించకుండా కొన్ని పోస్టులనే చూపిస్తున్నారని, దీంతో ఉపాధ్యాయులకు నష్టం జరుగుతుందని పేర్కొంటున్నాయి. ఉపాధ్యాయల సంఘాల స్టీరింగ్ కమిటీ కన్వీనర్ చావా రవి, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సోమయ్య, లింగారెడ్డి, ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ షౌకత్ అలీ, పిట్ల రాజయ్య ఈ విషయంపై స్పందించారు. బదిలీల్లో అన్ని ఖాళీలను చూపించి, బదిలీల అనంతరం సర్దుబాటు చేయాలని వారు కోరారు.

విద్యార్థుల సంఖ్య పేరిట వేలాది పోస్టులను బ్లాక్ చేసి అప్రకటిత రేషనలైజేషన్ చేస్తున్నారని ఆరోపించారు. దీనినితీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. కోర్టు కేసులను బూచిగా చూపి వేల సంఖ్యలో ఉండే ఎస్‌జీటీలకు ఆప్షన్ గడువును ఒక్క రోజే ఇచ్చి హడావుడిగా బదిలీలను ముగించాలని చూడటం సమంజసం కాదన్నారు. సీనియారిటీ జాబితాల్లో తప్పులు సవరించకుండా, ఖాళీలను పూర్తి స్థాయిలో చూపించకుండా జరిపే బదిలీల ద్వారా న్యాయం జరగదన్నారు.

# ఆరు గ్యారెంటీల అమలుపై బీఆర్ఎస్ తీవ్ర విమర్శలు

మొదటి పేజీ తరువాయి

పూర్తిగా అమలు చేయలేదు. దీంతో సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ ని, బీఆర్ఎస్ తీవ్రంగా విమర్శిస్తోంది. ఆరు గ్యారెంటీలలో కేవలం బస్సు, కరెంటు, గ్యాస్ సబ్సిడీ తప్ప, ఇప్పటివరకు ఉద్యోగాలు, మహిళలకు 2500, ఆడపిల్లలకు స్కూటీలు, కల్యాణ లక్ష్మితో పాటు, తులం బంగారం, ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో పథకాలు వారు అమలు చేయాల్సినవి ఉన్నాయి. కానీ వీటిలో ఏ పథకం గురించి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు అయితే ఉండడం లేదు. మరి ముఖ్యంగా నిరుద్యోగులకు ప్రభుత్వం రాగానే జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తా అన్నారు రేవంత్ రెడ్డి. కానీ ఇప్పటివరకు జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేయకపోవడంతో నిరుద్యోగులు జాబుల కోసం ఎదురుచూస్తున్నారు. పక్క రాష్ట్రమైనటువంటి ఏపీలో చంద్రబాబు సీఎంగా వచ్చిన మొదటి సంతకమే మెగా డీఎస్సీ పై పెట్టారు. దీంతో తెలంగాణ రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులంతా ఏకమై ఉద్యోగాలు లేవు, ఏమి లేవు అంటూ కాంగ్రెస్ సర్కారుపై గుర్రు మీద ఉన్నారు. ఇదే విషయమై తెలంగాణ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు స్పందిస్తూ కాంగ్రెస్పార్టీ సర్కారుపై తీవ్రంగా విమర్శలు చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు లక్షల ఉద్యోగాలు ఏడాదిలోగా పూర్తి చేస్తామని చెప్పారు. ఇప్పటికీ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడిచిన ఒక్క జాబ్ నోటిఫికేషన్ ఇవ్వలేదని హరీష్ రావు మీడియా వేదికగా విమర్శించారు. ఆనాడు అశోక్ నగర్ కి వెళ్లి రేవంత్ రెడ్డి ఇతర నాయకులంతా అధికారంలోకి రాగానే అందరికీ ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి వారితో ఓట్లు వేయించుకొని మోసం చేశారని తెలిపారు. మరి ఇప్పుడు ఆ అశోక్ నగర్ లో నిరుద్యోగుల సమస్యలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. తొందరలోనే నిరుద్యోగులకు న్యాయం చేయకుంటే మాత్రం తెలంగాణ రాష్ట్రంలో మరో ఉద్యమం మొదలవుతుందని, నిరుద్యోగుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఉండి కొట్లాడుతుందని అన్నారు. అశోక్ నగర్ లో ఇచ్చిన హామీలన్నిటిని నెరవేర్చకుంటే మాత్రం తెలంగాణ ఉద్యమం కోసం విద్యార్థులు నిరుద్యోగులు ఏ విధంగా కొట్లాడారో, ఆ విధంగానే ఉద్యోగాల కోసం నిరుద్యోగులంతా రోడ్లపైకి వచ్చే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ఈ విధంగా హరీష్ రావు కామెంట్స్ చేయడంతో కాంగ్రెస్ సర్కారుకు హడలు పుడుతోంది. ఒకవేళ నిరుద్యోగులు రోడ్డు ఎక్కితే మాత్రం పరిస్థితి నల్లేరుపై నడకే అంటూ సీఎం రేవంత్ రెడ్డి వణికిపోతున్నారని తెలుస్తోంది.

# 80 శాతం ఆస్పత్రుల్లో కనీస సౌలతులు ప్రమాణాలు లేవు



మొదటి పేజీ తరువాయి

(ఎన్ హెచ్ఎం) పరిధిలోని జిల్లా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రైమరీ హెల్త్ సెంటర్లు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు (సబ్ హెల్త్ సెంటర్లు) వంటివి మొత్తం 2 లక్షల పబ్లిక్ హెల్త్ ఫెసిలిటీలు ఉన్నాయి. ఇందులో జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఐపీహెచ్ఎస్‌కు అనుగుణంగా కనీస సౌలతులు ఉన్నాయా.. లేవా.. అన్నది గుర్తించేందుకు కేంద్ర ఆరోగ్య శాఖ ఇటీవల ఒక సెల్ఫ్ అసెస్ మెంట్ సర్వేను నిర్వహించింది. ఇందులో భాగంగా ఆయా ఆస్పత్రుల్లో సౌలతులు, డాక్టర్లు, నర్సులు, ఎక్విప్ మెంట్స్, మందులు, అత్యవసర సర్వీసులు, ఇతర వివరాలను ఎంటర్ చేసేందుకు ఒక డ్యాష్‌బోర్డును ప్రారంభించింది. మొత్తం 2 లక్షల ప్రభుత్వ దవాఖాన్లకు గాను 40,451 ఆస్పత్రులు తమ వివరాలను ఎంటర్ చేశాయి. దీంతో కేవలం 8,089 ఆస్పత్రులు మాత్రమే ఐపీహెచ్ఎస్ కు అనుగుణంగా నిర్దేశించిన కనీస ప్రమాణాలకు అవసరమైన మేరకు 80 శాతం, అంతకుమించిన స్కోర్ సాధించాయని వెల్లడైంది. అంటే వీటిలో మాత్రమే అన్ని సౌలతులు, డాక్టర్లు, స్టాఫ్, మందుల వంటివి నిర్దేశించిన మేరకు ఉన్నాయని తేలింది. అలాగే 17,190 ఆస్పత్రులు 50 శాతం కంటే తక్కువగా స్కోర్ చేయగా మిగతా 15,172 దవాఖాన్లు 50 నుంచి 80 శాతం మధ్యలో స్కోర్ చేశాయి.

# ప్రఖ్యాత పుణ్యక్షేత్రం తిరుమలలో భక్తుల తాకిడి

మొదటి పేజీ తరువాయి

హుండీ ద్వారా 3.83 కోట్ల రూపాయల ఆదాయం తిరుమల తిరుపతి దేవస్థానానికి అందింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయాయి. ట్రావెలర్స్ బంగ్లా కాటేజీల వరకు క్యూ లైన్ ఏర్పడింది. టోకెన్ లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనానికి 18 నుంచి 20 గంటల సమయం పట్టింది. కంపార్ట్‌మెంట్లల్లో ఉన్న వారికి టీటీడీ సిబ్బంది అన్నప్రసాదాలు, మజ్జిగ, మంచినీరు, అల్పాహారాన్ని పంపిణీ చేశారు టీటీడీ సిబ్బంది. తిరుమలలో దళారుల వ్యవస్థను రూపుమాపడంపై టీటీడీ దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా కొన్ని విప్లవాత్మక చర్యలపై కసరత్తు మొదలుపెట్టింది. శ్రీవారి దర్శనం టికెట్ల డూప్లికేషన్, నకలీ వెబ్‌సైట్లు పుట్టుకురావడం, ఆన్‌లైన్ దరఖాస్తులను మానిప్యులేట్ చేయడం వంటి సమస్యలను పరిష్కరించడానికి నడుం బిగించింది. ఇందులో భాగంగా– భక్తులకు అందించే ఆన్‌లైన్ సేవలన్నింటినీ కూడా ఆధార్ కార్డ్‌తో అనుసంధానం చేయాలని ప్రాథమికంగా నిర్ణయించింది. దీనిపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలంటూ టీటీడీ కార్యనిర్వహణాధికారి జే శ్యామలరావు ఆదేశించారు. ఆన్‌లైన్ సేవలను ఆధార్ కార్డుతో లింక్ చేయడం ద్వారా పారదర్శకతతో పాటు దళారీ వ్యవస్థను నిర్మూలించడానికి వీలవుతుందని చెప్పారు. ప్రస్తుతం టీటీడీ దర్శనం టికెట్ల జారీ, వసతి గదుల కేటాయింపు, ఆర్జిత సేవలు, శ్రీవారి సేవ తదితర సేవలు ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకునే వెసలుబాటు భక్తులకు ఉంది. అయినప్పటికీ– దళారుల బెడద తప్పట్లేదని, వారిని నియంత్రించడానికి ఆధార్ కార్డుతో అనుసంధానం చేయడంపై అధ్యయనం చేయాలని శ్యామలరావు అన్నారు. దీనికోసం యూఐడీఏఐ అధికారుల సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆధార్ ద్వారా భక్తులను గుర్తించడం, బయోమెట్రిక్ వెరిఫికేషన్ వంటి అంశాలు సులభతరమౌతాయని అన్నారు.


# మన్ కీ బాత్ ని పునః ప్రారంభించిన మోదీ

మొదటి పేజీ తరువాయి

గుర్తు చేసుకున్నారు. తల్లి పేరు మీద చెట్టును నాటడం అనే కొత్త సంప్రదాయానికి తెరలేపారు. నేను కూడా నా తల్లి పేరు మీద ఒక మొక్కను నాటాను. అలాగే దేశ ప్రజలందరూ తమ తల్లులను గౌరవించేలా, ప్రతి ఒక్కరు తమ తల్లి పేరు మీద మొక్కను నాటాలని మోడీ పిలుపునిచ్చారు. ఇంకా, శనివారం జరిగిన టీ20 ప్రపంచ కప్ 2024 ఫైనల్‌లో భారత జట్టు విజయం సాధించడాన్ని ప్రత్యేకంగా మోడీ ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన భారత జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, వచ్చే నెలలో జరగనున్న పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొననున్న భారత అథ్లెట్ల గురించి కూడా ప్రధాని మాట్లాడారు. భారత అథ్లెట్లు 900కు పైగా అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నారని పేర్కొన్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో ఆటగాళ్లు అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తారని దేశం ఆశిస్తున్నదని, వారిని ప్రోత్సహించాలని ప్రజలను కోరారు. కేరళలో తయారు చేయబడిన ప్రత్యేకమైన గొడుగుల గురించి మోడీ ఈ కార్యక్రమంలో ప్రస్తావించారు. కేరళ సంస్కృతిలో గొడుగులకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. అక్కడ అనేక సంప్రదాయాలు, ఆచారాలలో గొడుగులు ముఖ్యమైన భాగం అని మోడీ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ అరకు లోయలోని ప్రత్యేక కాఫీ గురించి కూడా మోడీ దీనిలో మాట్లాడారు. ఇది గొప్ప రుచి, సువాసనకు ప్రసిద్ధి చెందిందని ఆయన అన్నారు.

# ఖమ్మం నగరానికి రింగ్ రోడ్డు ఏర్పాటు

మొదటి పేజీ తరువాయి




కలిపేందుకు మరో ఆరున్నర కిలోమీటర్ల మేర లింక్ అవసరం కాగా, తాజాగా ఆ రోడ్డుకు కూడా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అనుమతిచ్చింది. 2024, 25 సంవత్సరానికి గాను ఉమ్మడి జిల్లాలో ఆరు రహదారుల కోసం రూ.654.86 కోట్ల పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులోనే ఎన్.హెచ్ .365 (ఏ), ఎన్‌హెచ్ 163 (జీ) మధ్య లింక్ రోడ్డుకు రూ.125 కోట్లకు అప్రూవల్ ఇచ్చింది. రెండు, మూడు నెలల్లోనే పూర్తి స్థాయి డీపీఆర్ ను సిద్ధం చేసి, టెక్నికల్ శాంక్షన్ తీసుకోనున్నారు. ఆ తర్వాత టెండర్లను పిలుస్తారు. వేగంగా పనులు జరుగుతుండడంతో మరో ఏడాదిలోగా మూడు జాతీయ రహదారులు పూర్తి కానుండగా, తాజాగా మంజూరైన లింక్ రోడ్డు పనులు కూడా పూర్తయితే మరో రెండేళ్లలోనే ఖమ్మం చుట్టూ రింగు రోడ్డు ఏర్పాటుకానుంది. నగరంలోని ట్రాఫిక్‌తో సంబంధం లేకుండా ఈ రింగ్ రోడ్డు గుండానే త్వరగా జర్నీ చేసే వీలు కలగనుంది.

**మూడు వైపులా నాలుగు లేన్ల రోడ్లు**

ఖమ్మం నగరం మీదుగా సూర్యాపేట, దేవరపల్లి జాతీయ రహదారిని రూ.2,200 కోట్లతో నిర్మిస్తున్నారు. నాగ్ పూర్, విజయవాడ జాతీయ రహదారిని రూ.6,700 కోట్లతో నిర్మిస్తున్నారు. కోదాడ, కొరివి జాతీయ రహదారిని రూ.1,500 కోట్లతో నిర్మిస్తున్నారు. వీటి కారణంగా మూడు వైపులా నాలుగు లేన్ల జాతీయ రహదారులు కొత్తగా నిర్మాణం జరుగుతున్నాయి. ఖమ్మం నగరానికి ఉత్తరభాగంలో కేవలం ఆరున్నర కిలోమీటర్లను కొత్త రోడ్ల మధ్య లింక్ చేయడం ద్వారా ఇప్పుడు రింగ్ రోడ్ రూపుదిద్దుకోబోతోంది. వాస్తవానికి ఈ జాతీయ రహదారుల నిర్మాణానికి ముందే ఖమ్మం నగరానికి ఔటర్ రింగ్ రోడ్డును ప్రతిపాదించారు. బీఆర్ఎస్ మొదటి ప్రభుత్వంలో తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర ఆర్ అండ్ బీ మినిస్టర్ గా ఉన్న సమయంలో రూ.180 కోట్లతో మంజూరు చేశారు. అప్పట్లో నిధుల కొరత కారణంగా ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రాక పెండింగ్ లో పడింది. ఆ తర్వాత కొత్తగా జాతీయ రహదారులు ఏర్పాటు కావడంతో వాటిని ఉపయోగించుకుంటూ రింగ్ రోడ్డు ను ఏర్పాటు చేసేలా ప్లాన్ వేశారు.

**సర్వీస్ రోడ్లు కూడా ప్రపోజ్ చేస్తున్నాం**

ఖమ్మం నగరం చుట్టూ రింగ్ రోడ్డు ఉండాలని గతంలో ఆర్ అండ్ బి మంత్రిగా ఉన్న సమయంలోనే రూ.180 కోట్లతో మంజూరు చేశాం. నిధుల సమస్య కారణంగా అప్పుడు ఏర్పాటుకాలేదు. జాతీయ రహదారుల కారణంగా ఇప్పుడు రింగ్ రోడ్డు ఏర్పాటవుతుండడం సంతోషంగా ఉంది. రింగ్‌రోడ్డు చుట్టూ సర్వీస్ రోడ్లు ఉంటేనే ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. రోడ్డు పక్కన హ్యాబిటేషన్లు ఉంటేనే ఎన్‌హెచ్ అధికారులు సర్వీస్ రోడ్డు మంజూరు చేస్తారు. ముందైతే సర్వీస్ రోడ్లకు ప్రపోజల్స్ పంపించాలని అధికారులకు సూచించాను.

# కొత్త క్రిమినల్ చట్టాల వల్ల బాధితులకే ఎక్కువగా నష్టం

మొదటి పేజీ తరువాయి

కీలక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. వాటి స్థానంలో జులై 1 నుంచి దేశంలో మూడు కొత్త చట్టాలు అమల్లోకి వస్తాయని చెప్పారు. గతేడాది ఆగస్టులో ఈ మూడు బిల్లులను కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిందని.. స్టాండింగ్ కమిటీ సభ్యులు బిల్లులకు అనేక సూచనలు చేశారన్నారు. అయితే, మోదీ ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదని.. వారు తెచ్చిన బిల్లులనే ఆమోదించుకున్నారని వినోద్ ఆరోపించారు. ఈ చట్టాల వల్ల బాధితులకు నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. ఈ చట్టాలను జూలై 1నుంచి అమలులోకి తెస్తున్నారని చెప్పిన వినోద్ కుమార్.. ఇండియన్ పీనల్ కోడ్ ఏది నేరమో చెబుతోందన్నారు. కానీ, ఇండియన్ పీనల్ కోడ్ పేరును మార్చి భారతీయ న్యాయ సన్నిహిత అని పెట్టారన్నారు. సీఆర్పీసీ కి భారతీయ నాగరిక సంహిత అని పేరు పెట్టారని తెలిపారు. కొత్త చట్టాల పేర్లు దక్షిణ భారత రాష్ట్రాల భాషకు వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. హిందీ, సంస్కృత భాషను తమపై ఎందుకు రుద్దుతున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని వినోద్ కుమార్ ప్రశ్నించారు. ఈ కొత్త చట్టాలను నిలుపుదల చేయాలని వినోద్ డిమాండ్ చేశారు. బ్యూరోక్రసి రూపొందించిన చట్టాలను బలవంతంగా ప్రజలపై రుద్దుతున్నారని విమర్శించారు. కొత్త చట్టంలో కంప్లైంట్ వస్తే విచారణ పేరుతో 15రోజుల వరకు %ఖీ×=% చేయకుండా కాలయాపన చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు వినోద్. అంతేకాదు ఈ చట్టం వల్ల బాధితుడికి అన్యాయం జరుగుతుందని రిమైండ్ చేసి 14రోజుల లోపు పోలీస్ కస్టడికి తీసుకునే చట్టాన్ని 90రోజులకు పెంచారన్నారు. కొత్త చట్టాల్లో అనేక లోపాలు ఉన్నాయన్నారు. ఈ కొత్త చట్టాల వల్ల పోలీస్ పవర్స్ మరింత పెరుగుతాయని వాటిని పోలీసులు దుర్వినియోగం చేసే అవకాశం ఉందన్నారు. అందుకే ఈ చట్టాలపై సోమవారం నాడు సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేస్తున్నామని వినోద్ కుమార్ తెలిపారు.